ఆశాజనకంగా కంది పంట

- ముందస్తు నివారణ చర్యలు తప్పనిసరి
- జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి


కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి తదితరులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో కంది పంట ఆశాజనకంగా ఉంది. పురుగులు ఆశించే సమయంలో రైతులు ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ భిక్షపతి అన్నారు. మండలంలోని హుగ్గెల్లి గ్రామ పరిధిలోని కంది పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ కంది పంటకాలంలో రకాన్ని బట్టి 150 నుంచి 180 రోజుల్లో క్రాప్ చేతికి వస్తుందన్నారు. చాలా ప్రాంతాల్లో కంది ఏపుగా పెరిగి పూత, పిందె తయారయ్యే సున్నితమైన దశలో ఉంది. ఈ దశలోనే వివిధ రకాల పురుగులు పంటపై దాడి చేస్తాయన్నారు. కొన్ని చోట్ల పురుగుల బెడద ప్రారంభమైందని చెప్పారు. పూత, కాత దశలో ఉన్న కంది పంటలో ఆకు చుట్టూ పురుగులు, మారుకా మచ్చలపురుగు, కాయతొలుచు పురుగు, ఎండు తెగులు, గొడ్డు మోతు తెగులు, రసం పీల్చే పురుగులు, పూత పెంకు పురుగులు, శనగ పచ్చపురుగులు ఆశించడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయన్నారు.

'కాయ తొలిచే పురుగు దీర్ఘకాలిక రకాలలో ఎక్కువగా ఆశిస్తుందన్నారు. తల్లి పురుగుగుడ్లను అభివృద్ధి చెందుతున్న పిందెలలో చొప్పిస్తుందన్నారు. గుడ్ల నుంచి వెలువడిన పిల్ల పురుగులు అభివృద్ధి చెందుతాయని, పురుగులు తిన్న గింజలు దెబ్బతింటాయన్నారు. పురుగు నివారణకు తొలి దశలో 5 శాతం వేప నూనె పిచికారీ చేయాలన్నారు. మోనోక్రోటోఫాస్ 1.6 మీ.లీ లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని చెప్పారు.' ఆకుమచ్చ పురుగు పంట పెరిగే దశలో ఆకుచుట్టూ పురుగు ఆశించి నష్టం చేస్తుంది. లద్దె పురుగు ఆకులను చుట్టుకొని లోపల ఉండి తింటాయన్నారు. పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 .మీ.లీ లేదా క్వినోల్‌పాస్ 2 మీ.లీ లీటరు నీటికి కలిసి పిచికారీ చేయడం మంచిది.

'శనగ పచ్చ పురుగు లేత చిగుళ్లపై, పూత మొగ్గలపై గుడ్లను పెండుతుంది. లార్వాలు తొలి దశలో మొగ్గల్ని గోకితిని తరువాత మొగ్గల్ని తొలిచి కాయలోపలికి తలను జొప్పించి లోపలి గింజలను తింటుంది. పురుగులను గమనించి వెంటనే ఏరివేయాలని, ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చాలన్నారు.

తొలి దశలోనే గమనిస్తే వెంటనే ఇండాక్సాకార్బ్ 1మి.లీ లేదా స్పైనోసాడ్ 3 మీ.లీ లేదా క్లోరోద్రనిలప్రోల్ 0.3 మీ.లీ లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మీ.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పూత పెంకు పురుగులు కంది పూతదశలో ఉన్నప్పుడు మొగ్గలను తింటాయి. గమనించి వెంటనే ఏరివేసి నాశనం చేయాలన్నారు. రసం పీల్చే పురుగులకు డైమిథోమెట్ 2 మీ.లీ లేదా మోనోక్రోటోపాస్ 1.6 మీ.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గొడ్డు మోతు తెగులుకు గంధకం 3 గ్రా. లీటరు నీటికి లేదా డైకోపాస్ 5 మీ.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని భిక్షపతి వివరించారు.

సర్వే వివరాల నమోదుపై శిక్షణ


సమావేశంలో కమిషనర్ మంగతాయారు, ఆర్‌ఓ నర్సింలు


కల్హేర్(నారాయణఖేడ్): మాట్లాడుతున్న ఎంపీడీఓ

జిన్నారం (పటాన్‌చెరు): సమగ్ర సర్వే ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియపై డేటా ఎంట్రీ ఆపరేటర్లకు బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆధ్వర్యంలో మంగళవారం ట్రైనర్ మహేందర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వే ఈ నెల 23తో ముగుస్తుందని తెలిపారు. సర్వే వివరాలను సూపర్‌వైజర్, ఎన్యుమరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఎలాంటి పొరపాటు లేకుండా అందించాలని సూచించారు. మున్సిపాలిటీలో 7325 కు టుంబాలను సర్వే చేసినట్లు చెప్పారు. దాదాపు 40 శాతం సర్వే పూర్తయిందన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు నిర్మలారెడ్డి, ఆర్వో నర్సింలు, సూపర్‌వైజర్లు, మాస్టర్ ట్రైనర్ మహేందర్, కంప్యూ టర్ ఆపరేటర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి

కంది(సంగారెడ్డి): సర్వేకు అందరూ సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరా రు. మంగళవారం కందిలో నిర్వహిస్తున్న కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పులు లేకుండా సర్వే చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. సర్వే చేసిన ఇళ్ల స్టిక్కర్ తప్పకుండా అంటించాలన్నారు. కార్యక్రమంలో ఈఓ విద్యాధర్‌గౌడ్‌తోపాటు ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే కొనసాగుతోంది. మంగళవారం ఝరాసంగం, సిద్దాపూర్ గ్రామాల్లో కొనసాగింది. ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి సమాచారం అందించి, అధికారులకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): సమగ్ర కుటుంబ సర్వేపై మంగళవారం సిర్గాపూర్ మండల పరిషత్తు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మల్సూర్ మాట్లాడుతూ.. సమగ్ర సర్వే వివరా లు కంప్యూటరీకరణ చేసేందుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఎంఈఓ నాగరం శ్రీనివాస్, ఏపీఓ బస్వరాజ్, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన భెల్ సభ్యులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేందర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కలెక్టర్ క్రాంతిని బీహెచ్‌ఈఎల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవ కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించడం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నికైన తమ సభ్యులతో కలసి కలెక్టర్‌ను కలవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేష్, సభ్యుడు శ్రీను, కోటేశ్వర్‌రావు, యేలేందర్, జానయ్య పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డును పూర్తి చేయండి


డిప్యూటీ ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నుంచి సిర్గాపూర్ మీదుగా మాసాన్‌పల్లి వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయించాలన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ నర్సింహులుకు మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్‌లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రోడ్డు గుండా ప్రతీ రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. ఖేడ్ నుంచి సిర్గాపూర్ మీదుగా మాసాన్‌పల్లి వరకు రోడ్డు పనులు పూర్తయితే జాతీయ రహదారికి తక్కువ సమయంలో చేరుకోగలమని అన్నారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడని చెప్పారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకులు మల్గొండ, సాయి, జైపాల్ నాయక్ ఉన్నారు.

పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలి


సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నరసింహా


రైతులతో మాట్లాడుతున్న నరసింహా

జిన్నారం (పటాన్‌చెరు): 50 సంవత్సరాలుగా ప్రభుత్వ కస్టోడియన్ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలను ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మడిదల మండలం లక్ష్మాపూర్ గ్రామంలో సర్వేనంబర్ 1, 59లో 1000 ఎకరాల కస్టోడియన్ భూములను సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, మెదక్ జిల్లా కార్యదర్శి ఖాలిక్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు నరసింహ మాట్లాడుతూ.. రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కస్టోడియన్ భూముల్లో 800 ఎకరాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయని, వాటిని ఆయా గ్రామాల్లో ఉన్న పేద ప్రజలకు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ మేరకు తక్షణమే అధికారులు గ్రామంలో సందర్శించి సాగులో ఉన్న రైతుల భూములకు పట్టా పుస్తకాలు ఇవ్వడంతో పాటు మిగిలిన భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో లక్షలాది ఎకరాలలో ప్రభుత్వ దేవాలయ వక్ఫ్, భూదాన్ భూములను ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై బినామీలను సృష్టించుకుని అక్రమంగా పట్టాలివ్వడం జరుగుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో ధరణి వచ్చిన తర్వాత చాలా ప్రభుత్వ భూములను దొంగచాటుగా అక్రమంగా అధికార పార్టీ నాయకుల అనుచరుల పేరు మీద పట్టాలు చేయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహబూబ్ ఖాన్, మోహన్ రెడ్డి, దేవేందర్, బాధిత రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయండి

మాధవనంద సరస్వతీ


అనుగ్రహ భాషణ చేస్తున్న మాధవనంద స్వామి

జహీరాబాద్ టౌన్: సంఘాలకు అతీతంగా ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు బ్రాహ్మణులందరూ కృషి చేయాలని మాధవానంద సరస్వతీ స్వామి సూచించారు. పట్టణంలోని నూతనంగా నిర్మించే శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆవరణలో వైదిక, వైదికతర బ్రాహ్మణులకు అనుగ్రహ భాషణం అందించే కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాలు ఎన్ని ఉన్నా ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అందరు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 19వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు న్యాల్‌కల్ మండలం రేజింతల్‌లోని సిద్ధివినాయక దేవస్థానంలో లోకకల్యార్థం కోటి రుద్ర పారాయణం, లక్ష మోదక హవనం కార్యక్రమానికి సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనాలని అన్నారు. ఈ నెల 24న సంగారెడ్డిలో జరిగే అష్టోత్తర శత సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను, మాతృ, పితృ వందన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని రాజోల గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సమీర్ వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. సమీర్ తండ్రి రియాజ్ 8 నెలల క్రితం మృతి చెందాడు. అంతకంటే ముందు బావ కూడా మృతి చెందాడు. ఈ బాధతో పాటు కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై, జీవితంపై విరక్తి చెందిన సమీర్ ఈనెల 15న పొలం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సమీర్ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

20 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 18 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా, ఒకరికి రూ.1500, మరొకరికి రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


సంతాపం తెలుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం, సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ శనివారం గుండెపోటుతో మృతి చెందిన హిందీ పండిట్ భాస్కర్ ఆత్మకుశాంతి చేకూరాలని మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.అందరితో కలుపుగోలుగా ఉంటూ మంచిపేరు సంపాదించుకున్న ఉపాధ్యాయుడు అకాల మరణం అందరిని కలిచివేసిందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుల, మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. మంగళవారం సంగారెడ్డి ఆర్టీసీ డిపో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. సాయిలు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలు ఎత్తివేయాలని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పని గంటల పెరుగుదల, విపరీతమైన పని భారంతో ఉద్యోగ, కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, బాబురావు, అశోక్, శివ, మహేశ్ యాదగిరి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై విమర్శలు సరికాదు


మాట్లాడుతున్న నాయకురాలు గోదావరి

రామచంద్రాపురం(పటాన్‌చెరు):కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు చేయడం సర్రైనది కాదని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అన్నారు. రాష్ట్ర సాధనకు కిషన్ రెడ్డి పోరుయాత్ర చేశారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ కావాలని నిరహారదీక్ష చేశారని తెలిపారు. కిషన్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి సమైక్యాంధ్రకు కోసం సహకరించిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. ప్రధా ని నరేంద్ర మోదీ సైతం తెలంగాణ అభివృద్ధికి లక్షల కోట్ల నిధులు ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల హామీలను అమలు చేయలేక ఇతరులపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నేతలను విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

నూతన సీఐలుగా బాధ్యతల స్వీకరణ


నయీముద్దీన్


రవీందర్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ నూతన సీఐగా రవీందర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొల్లారం పారిశ్రామికవాడలో శాంతి భద్రతల పరిరక్షణకు సంపూర్ణంగా కృషి చేస్తానన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ గంగాధర్ బదిలీపై ఐజీ ఆఫీసుకు వెళ్లారు.

జిన్నారం సీఐగా నయీముద్దీన్

జిన్నారం సర్కిల్ సీఐగా నయీముద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన సు . దీర్‌కుమార్ ఐజీ ఆఫీసుకు బదిలీ అయ్యారు. నయీముద్దీన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. శాంతి భద్రతల స్థాపనలో అందరి సహకారంతో ముందుకెళ్తానన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవి

నారాయణఖేడ్: ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. మనూరు మండలంలోని పీహెచ్‌సీల పరిధిలోని ఆశవర్కర్లతో మంగళవారం మనూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వా లని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సర్వేల పేరుతో అధికారులను వేధించడం ఆపాలని అన్నా రు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆశవర్కర్లకు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు ఎలీషా, లక్ష్మి, సాయమ్మ, మంజుల, నర్సమ్మ పాల్గొన్నారు.

ఉక్కుమహిళ ఇందిరా గాంధీకి నివాళి

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. గరీబ్ హటావో నినాదంతో పేద ప్రజలకు ఎంతో మేలు చేసారని అన్నారు. –సాక్షి నెట్‌వర్క్


సంగారెడ్డి రూరల్: ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నిర్మలారెడ్డి


జహీరాబాద్ టౌన్: నివాళులర్పిస్తున్న నాయకులు


నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు


పటాన్‌చెరు టౌన్: నివాళులర్పిస్తున్న నీలం మధు

ప్రమాదకరంగా ..


తిను బండారాల లోడును తరలిస్తున్న వాహనం

సంగారెడ్డి జోన్: పలువురు వాహనదారులు సరుకులను ఇష్టారీతిగా రవాణా చేస్తున్నారు. ప్రమాదం అని తెలిసినా తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. విద్యుత్తు తీగలు తగిలేలా ఉన్నా నిర్లక్ష్యంగా రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలో ప్రధాన రహదారిపై టాటా ఏసీ వాహనంలో చిరుతినుభండారాలను చాలా ఎత్తులో ఉంచి, పరిమితికి మించి తరలించారు.

క్లుప్తంగా

పేదల భూములు లాక్కోవడం దారుణం

నారాయణఖేడ్: ఫార్మాసిటీ పేరిట పేద గిరిజనుల భూములను ప్రభుత్వం లాక్కోవడం దారుణమని మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయినాయక్, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. భూములను లాక్కోవడమే కాకుండా అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని అన్నారు. ఫార్మాసిటీ కోసం భూసేకరణను నిలిపివేసి అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలోని గిరిజనులంతా ఏకమై ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాడతామన్నారు. మాజీ ఎంపీటీసీ నారాయణ, మాజీ సర్పంచ్ రవి, టీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు అంజగౌడ్, నాయకులు శంకర్‌నాయక్, సర్దార్‌నాయక్, మల్గొండ, దస్తగిరి, మహేందర్ పాల్గొన్నారు.

మరుగుదొడ్డి తప్పనిసరి


అవగాహన కలిపిస్తున్న ఎంపీడీఓ మల్సూర్

కల్హేర్(నారాయణఖేడ్): ప్రతి ఇంటికి తప్పనిసరిగా మరుగుదొడ్డి ఉండాలని సిర్గాపూర్ ఎంపీడీఓ మల్సూర్ పేర్కొన్నారు. మంగళవారం సిర్గాపూర్ మండల కేంద్రంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. మరుగుదొడ్ల వాడకం, పరిశుభ్రతపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో ఏపీఓ బస్వరాజ్, పంచాయతీ సెక్రటరీ నవీన్‌రెడ్డి, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి


పశువులకు చికిత్సలు చేస్తున్న వైద్యుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): పాడి పశువుల పెంపకంలో మెలకువలు పాటిస్తే మంచి లాభాలను పొందవచ్చునని వైశు వైద్యాధికారి గణేష్ అన్నారు. మంగళవారం మండలంలోని ముంగి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు చికిత్సలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి పశువుల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పాల ఉత్పత్తులను పెంచవచ్చునన్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, వైద్య సిబ్బంది, గోపాల మిత్రులు జనార్ధన్‌రెడ్డి, పశుపోషణాదారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం



జహీరాబాద్: సంగారెడ్డిలో నిర్వహించిన కరాటే బెల్ట్ పరీక్షలో చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మంగళవారం నిర్వహించిన పరీక్షలో ప్రతిభకనబర్చిన 11 మంది చిన్నారులకు ఆరెంజ్, 9 మందికి ఎల్లో బెల్ట్ సర్టిఫికెట్లను గ్రాండ్ మాస్టర్ సాజీద్ అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్లు అశోక్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



జిన్నారం (పటాన్‌చెరు): కంది మండలం బేగంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి మాదారం గ్రామ మాజీ సర్పంచ్ సరితా సురేందర్‌గౌడ్ రూ.50వేల రూపాయలు విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందన్నారు. ఆలయాల నిర్మాణానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహేష్ గౌడ్, వేణుగౌడ్, గణేష్ పాల్గొన్నారు.

వాహనాల వేలం

సంగారెడ్డి రూరల్: గంజాయి కేసులో పట్టుబడ్డ టూ వీలర్ సుజుకి యాక్సిస్, బజాజ్ ఆటో రిక్షా బుధవారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్స్‌స్పెక్టర్ నజీర్ పాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సంగారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో జరిగే వేలం పాల్గొనాలని కోరారు.

నేడు చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: సిర్గాపూర్ రైతు వేదికలో నేడు (ఈనెల 20న) బుధవారం ఉ.10:30 గంటలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సిర్గాపూర్, కల్హేర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి పంపిణీ చేస్తారని వివరించారు.